క్లుప్తంగా

జగన్ రాకతో పెత్తందార్ల రాజకీయాలకు తెర

కడియం: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక పెత్తందార్ల రాజకీయాలకు తెర పడిందని వైఎస్సార్ సీపీ కడియం మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. గతంలో గ్రామాల్లో ఇద్దరు, ముగ్గురు పెత్తందార్లతో మాత్రమే రాజకీయాల నడిచేవన్నారు. ఈ విధానికి సీఎం జగన్ చరమగీతం పాడారన్నారు. అణగారిన వర్గాలకు రాజ్యాధికారం దిశగా చర్యలు తీసుకున్నారన్నారు. వైఎస్సార్ సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ స్వచ్ఛత మన బాధ్యత కార్యక్రమం చేపట్టి పారిశుధ్య సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేశారన్నారు. ఆయనను చెత్త మంత్రి అంటూ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి విమర్శించారన్నారు. పదేళ్ల పాటు నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఏనాడు పారిశుధ్య సమస్యలను గోరంట్ల పట్టించుకోలేదన్నారు. అదే గోరంట్ల అదే స్వచ్ఛత కార్యక్రమం పేరు చెప్పుకుని చీపురు పట్టి ప్రచార ఆర్భాటం చేస్తున్నారన్నారు.

వైభవంగా కల్యాణ కార్తికేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ


కల్యాణ కార్తికేయస్వామి విగ్రహం

రాజమహేంద్రవరం రూరల్: కాతేరు సీతారామ అగ్రహారంలోని అభీష్ట గణపతి పంచాయతన దేవాలయంలో శుక్రవారం కల్యాణ కార్తికేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన అత్యంత వైభవంగా జరిగింది. అభీష్ట గణపతి ఆలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మూడు రోజులుగా తంగిరాల భాస్కర సుబ్రహ్మణ్యశర్మ సోమయాజులు ఆధ్వర్యంలో పూజలు జరుగుతున్నాయి. తంగిరాల భార్గవశర్మ దంపతులు స్వచ్ఛంద రుత్విక్కులు దేవరకొండ లక్ష్మీనరసింహశాస్త్రి, తంగిరాల గణేశ శర్మ, నరసింహశర్మ తదితరులు ప్రతిష్ఠ కార్యక్రమంలో పూజలు నిర్వహించారు. పిడపర్తి శివరామశర్మ అవధానులు, ఆహితాగ్నులు బ్రహ్మశ్రీ దేవరకొండ వీర వెంకట సత్యనారాయణమూర్తి సోమయాజులు, తంగిరాల మల్లికార్జునశర్మ సోమయాజులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజలకు మేలు

రాజమహేంద్రవరం రూరల్: కాంగ్రెస్‌తోనే ప్రజలందరికీ మేలు జరుగుతుందని ఆ పార్టీ రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు అన్నారు. కవలగొయ్యిలోని సువర్ఛల ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి బాలేపల్లి మురళీధర్ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. రుద్రరాజు, మురళీధర్ ఇంటింటికీ పర్యటించి ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి బోడా వెంకట్, సీపీఎం కార్యదర్శి మధు, అంకం గోపి పాల్గొన్నారు.

ఓటుహక్కును వినియోగించుకోవాలి



వీరవరంలో ర్యాలీ చేస్తున్న మహిళలు

కడియం: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని వీరవరంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ముందుగా ముగ్గుల పోటీలు జరిపారు. అంతకు ముందు గ్రామంలో ర్యాలీ చేశారు. ఏపీఎం బి.అప్పలకొండ, కమ్యూనిటీ కో ఆర్డినేటర్ డీవీ సింహాచలం, వీఓఏలు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు, గ్రామ సంఘాల మహిళలు పాల్గొన్నారు.

గోరంట్ల ఎన్నికల ప్రచారం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాష్ట్రాభివృద్ధి కోసమే జనసేన, బీజేపీతో టీడీపీ అధినేత చంద్రబాబు పొత్తు పెట్టుకున్నారని కూటమి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. నగరపాలకసంస్థ పరిధిలోని 18వ డివిజన్‌లో ఆయన శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాబోయే ఎన్నికలలో సైకిల్ గుర్తుకు ఓటు వేసి, ఎంపీగా పురందేశ్వరిని, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని అభ్యర్థించారు.

బీఎస్పీ నాయకుల సమావేశం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజ్యాధికారంతోనే బహుజనుల సమస్యలు పరిష్కారమవుతాయని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బక్కా పరంజ్యోతి అన్నారు. ఆల్కాట్‌తోటలోని గేదెల నూకరాజు కల్యాణ మంటపంలో ఆ పార్టీ తూర్పుగోదావరి, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలకు చెందిన నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు పట్నాల విజయకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పరంజ్యోతి మాట్లాడుతూ రాష్ట్రంలోని 175 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తున్నామన్నారు.

జగన్ పాలనలో అందరికీ న్యాయం


దుళ్లలో దివ్యాంగుడి సమస్యలను తెలుసుకుంటున్న మంత్రి వేణు


ప్రచారంలో పాల్గొన్న దుళ్ల గ్రామస్తులు

- మంత్రి వేణుగోపాలకృష్ణ
- దుళ్లలో విస్తృత ప్రచారం

కడియం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కులమతాలకు అతీతంగా అన్ని వర్గాలకు న్యాయం జరిగిందని, ఆ పాలన కొనసాగాలంటే ఆయనే మళ్లీ సీఎం కావాలని మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మండలంలోని దుళ్ల గ్రామంలో శుక్రవారం ఆయన ఏపీ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, డాక్టర్ గూడూరి శ్రీనివాస్ తనయుడు గూడూరి భారతీరామ్‌తో కలిసి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కూడళ్లలో గ్రామస్తులను ఉద్దేశించి వేణు మాట్లాడారు. చేనేత కార్మికులకు సీఎం జగన్ అధిక ప్రాధాన్యత ఇచ్చి, వారి క్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారు. అటువంటి నేత మళ్లీ ముఖ్యమంత్రి కావాలంటే త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని కోరారు. చందన నాగేశ్వర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ బీసీల సంక్షేమానికి కృషి చేస్తున్నారని, సంక్షేమ అభివృద్ధి పథకాలతో పాటు విద్య, ఉద్యోగ, రాజకీయాలలో కూడా ప్రాధాన్యత కల్పిస్తున్నారని అన్నారు. బీసీలకు స్థానిక సంస్థలలో 40 శాతం వాటా ఇచ్చారని అన్నారు.

సమస్యలపై గోరంట్ల నిర్లక్ష్యం

మంత్రి వేణు మాట్లాడుతూ తన పర్యటన సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలను తెలిపారన్నారు. ఈ నియోజకవర్గ ప్రజలు ఎంతో నమ్మకంతో గోరంట్ల బుచ్చయ్య చౌదరిని ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజా సమస్యలను గాలికొదిలేశారన్నారు. డ్రైనేజీ, విద్యుత్ తీగలు తదితర సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు అవకాశం ఉన్నప్పటికీ గోరంట్ల పట్టించుకోలేదన్నారు. మీడియా ముందుకు వచ్చి మాట్లాడడం తప్పితే తనను గెలిపించిన ప్రజల ఇబ్బందులను మర్చిపోయారన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించుకోవాలంటే సీఎంగా జగన్‌ను, ఎంపీగా గూడూరి శ్రీనివాస్‌ను, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని వేణు కోరారు. కాగా ప్రచారానికి విచ్చేసిన వేణు, చందన నాగేశ్వర్‌లకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ప్రచార వాహనంపై నుంచి దిగి వెళ్లి మరీ దివ్యాంగుడి ఇబ్బందులను మంత్రి వేణు తెలుసుకున్నారు. అలాగే పొలాల్లో పనిచేస్తున్న కూలీల వద్దకు వెళ్లి జగన్ చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేణు వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గిరజాల వీర్రాజు, నక్కా రాజబాబు, రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య, శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, జేసీఎస్ కన్వీనర్ తాడాల చక్రవర్తి, దుళ్ల సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు, ఎంపీటీసీలు కట్టుంగ నాగరాజు, ఆకుల సుధాకర్, మాజీ ఎంపీటీసీలు తోకల వీర వెంకట్రావు, టేకి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు తాతపూడి బాబీ, సన్నపు బ్రహ్మానందం, నామాల బాలసరోజని, కంటిపూడి సాయి, ఇందుపురాల శ్రీను, సంగిత వెంకటేశ్వరరావు, అయినవిల్లి వెంకటేశ్వరరావు, అంగాడ సత్యప్రియ, కొత్తపల్లి శివాజీ, సాపిరెడ్డి సూరిబాబు, కొత్తపల్లి వెంకటేశ్వరరావు, గుబ్బల నాగార్జున, కట్టా జమీందారు, శాకా పట్టాభి, నందపునీడి గంగారావు, ఊటుకూరి శైలజ, చింతపర్తి రాంబాబు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల అధ్యాపకుడు మూర్తికి డాక్టరేట్


మూర్తికి పీహెచ్‌డీ ప్రదానం చేస్తున్న ప్రిన్సిపాల్ రామచంద్రరావు

కంబాలచెరువు: ఆర్ట్స్ కళాశాల గణిత శాస్త్ర అధ్యాపకుడు డీవీఎస్ఎస్ఆర్ మూర్తికి డాక్టరేట్ లభించింది. అదే కళాశాలలో గణిత శాస్త్ర విభాగంలో అధ్యాపకుడిగా సేవలు అందిస్తున్న డాక్టర్ సీహెచ్.శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఆయన పరిశోధన చేశారు. కెల్లర్ బాక్స్ పద్ధతిని ఉపయోగించి రసాయనిక ప్రతి చర్యలతో వివిధ రకాల ఐదు నాన్ న్యూటోనియస్ ఫ్లూయిడ్స్‌పై సంఖ్యాత్మక విశ్లేషణ అనే అంశంపై చేసిన పరిశోధనకు ఈ గౌరవం దక్కింది. ఈ మేరకు అధ్యాపకుడు మూర్తికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు పీహెచ్‌డీ ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎస్.శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కేఆర్‌లో వెబినార్

కంబాలచెరువు: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం బయోలాజికల్ సైన్స్ ఫర్ ద వెల్ఫేర్ ఆఫ్ మ్యాన్ కైండ్‌పై జాతీయస్థాయి వెబినార్ నిర్వహించారు. జంతు శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవకుమారి ప్రారంభించారు. అనంతరం ఐక్యూ ఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ బి.అనురాధ సూర్యకుమారి వెబినార్ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో అనిల్ కుమార్ పసుపులేటి, డాక్టర్ నూతలపాటి శ్రీనివాసు, సీహెచ్ ప్రియాంక, జి.దివ్యశ్రీ, డాక్టర్ పీఎస్‌సీహెచ్‌పీ దీపికారాణి, ఎం.కాన్మ పాల్గొన్నారు.

శ్రీనివాసరావు కార్టూన్‌కు ప్రత్యేక బహుమతి


గుత్తుల శ్రీనివాసరావు


బహుమతి పొందిన కార్టూన్

కడియం: విశాఖపట్నానికి చెందిన నార్త్ కోస్టల్ ఆంధ్ర కార్టూన్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో హాస్యానందం మాసపత్రిక సౌజన్యంతో నిర్వహించిన కార్టూన్స్ పోటీలో కడియం మండలం వేమగిరి గ్రామానికి చెందిన గుత్తుల శ్రీనివాసరావు కార్టూన్ ప్రత్యేక బహుమతికి ఎంపికైంది. ఆయనకు ఈ నెల 14న విజయవాడలో జరిగే కార్యక్రమంలో బహుమతి ప్రదానం చేస్తారు. బైక్ ఇన్సూరెన్స్, హెల్మెట్ ఉపయోగాలను వివరిస్తూ శ్రీనివాసరావు గీసిన ఈ కార్టూన్ నిర్వాహకులను ఆకట్టుకుంది.

తాత్కాలిక స్ట్రాంగ్‌రూమ్‌కు ఈవీఎంలు


ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్ భరత్

రాజమహేంద్రవరం రూరల్: కలెక్టరేట్ ఆవరణలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్(నేక్)లో ఏర్పాటు చేసిన రూరల్ నియోజకవర్గ తాత్కాలిక స్ట్రాంగ్‌రూమ్‌కు శుక్రవారం తొలి విడత ఈవీఎంలు చేరుకున్నాయి. నియోజకవర్గంలోని 267 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన బ్యాలెట్ యూనిట్లను ఇక్కడకు తీసుకువచ్చారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కె.మాధవీలత పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని 267 పోలింగ్ కేంద్రాలకు 320 చొప్పున బ్యాలెట్ యూనిట్స్, కంట్రోల్ యూనిట్స్, వీవీప్యాట్లు, రిజర్వ్ యూనిట్లు కేటాయించారన్నారు. వాటిని అత్యంత భద్రత మధ్య డీసీఎంఎస్ వాహనం ద్వారా రూరల్ స్ట్రాంగ్ రూమ్‌కు తీసుకువచ్చామన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్, ఆర్డీవో చైత్ర వర్షిణి, పార్లమెంటు సహాయ రిటర్నింగ్ అధికారి ఆర్.కృష్ణ నాయక్, ట్రైనీ ఎస్‌డీసీఎం భవానీ ప్రకాష్ పాల్గొన్నారు.

శాంతిభద్రతల రక్షణ సమష్టి బాధ్యత


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ అంబికా ప్రసాద్

కడియం: శాంతి భద్రతల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని దక్షిణ మండల డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ అన్నారు. ఇటీవల కడియపుసావరంలో మహాలక్ష్మి అమ్మవారి జాతర సందర్భంగా చెలరేగిన వివాదం నేపథ్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. డీఎస్పీ ఆధ్వర్యంలో ఇరువర్గాలకు చెందిన వారితో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ఎంపీడీవో జి.రాజమనోజ్, తహసీల్దార్ బి.రమాదేవి, కడియం ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్, ఎస్సై కృష్ణసాయి పాల్గొన్నారు. సంఘటనకు సంబంధించిన దృశ్యాలను ప్రొజెక్టరుపై ప్రదర్శించారు. ఇన్‌స్పెక్టర్ తులసీధర్ మాట్లాడుతూ ఇటువంటి ఘటన వలన సామాన్య ప్రజలకు ప్రాణనష్టం కలిగే ప్రమాదం ఉందన్నారు. వివాదాల్లో చిక్కుకున్న వారిపై కేసులు నమోదైతే సదరు యువకుల భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కాగా..ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా, రానున్న ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకారం అందిస్తామని ఇరువర్గాలకు చెందిన వారు తెలిపారు.

37 మంది వలంటీర్ల రాజీనామా


ఎంపీడీవో శ్రీనివాసరావుకు రాజీనామా పత్రాలు అందజేస్తున్న ధవళేశ్వరం వలంటీర్లు

రాజమహేంద్రవరం రూరల్: రూరల్ మండలంలో 37 మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామాలు చేశారు. హుకుంపేట మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో డి.శ్రీనివాసరావుకు వాటిని అందజేశారు. ధవళేశ్వరం సచివాలయం-1 పరిధిలో ముగ్గురు, ధవళేశ్వరం -2 పరిధిలో 10 మంది, ధవళేశ్వరం-3 పరిధిలో తొమ్మిది మంది, ధవళేశ్వరం-5 పరిధిలో 13 మంది, కోలమూరు-1 పరిధిలో ఇద్దరు రాజీనామా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు సేవ చేస్తున్న తమపై ప్రతిపక్షాల నాయకులు నిందలు వేస్తున్నారన్నారు. ఇప్పటికే బొమ్మూరు -2 వలంటీర్ నూనె దీపశ్రీ రాజీనామా చేసింది.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: సుబ్బారావు నగర్, కోలమూరు ఫీడర్ల మరమ్మతుల నేపథ్యంలో శనివారం నగరంలోని ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ ప్రకటించారు. ఉదయం 8 నుంచి 12 గంటల వరకూ ఆల్కాట్ గార్డెన్స్, శంభూనగర్, టి.నగర్, ఇన్నీసుపేట, తాడితోట ఇండస్ట్రియల్ కాలనీ, రెల్లిపేట, ఆంధ్ర నగర్, గోరక్షణపేట, పాత సోమాలమ్మ గుడి వీధి, దానవాయిపేట, ప్రకాశం నగర్, తిలక్ రోడ్, మీఎల్ పురం, మార్గాని ఎస్టేట్స్, రామాలయం సెంటర్, వెంకటేశ్వర జనరల్ మార్కెట్, రహమత్ నగర్, ఆవ వాంబే కాలనీ, తూర్పు రైల్వే స్టేషన్ రోడ్డు ప్రాంతాలలో సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు. ఉదయం 9 నుంచి 10 గంటల వరకూ ఉమెన్స్ కాలేజ్ రోడ్డు, సెయింట్ పీటర్స్ చర్చి, హర్ష హాస్పిటల్ రోడ్డు, చైతన్య కాలేజ్ రోడ్డు ఏరియాలలో సరఫరా ఉండదన్నారు.

ఇంటర్‌లో 83 శాతం ఉత్తీర్ణత

ధవళేశ్వరం: ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ధవళేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు 83.45 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జేవీఎస్ఎస్ సుబ్రహ్మణ్యం తెలిపారు. మొత్తం 133 మంది పరీక్షలకు హాజరు కాగా 111 మంది ఉత్తీర్ణత సాధించారని వెల్లడించారు. ఇంటర్ మొదటి సంవత్సరానికి సంబంధించి 57.33 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. మొత్తం 150 మంది పరీక్షలకు హాజరు కాగా 86 మంది పాసయ్యారన్నారు.

54 శాతం ఉత్తీర్ణత

కడియం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 54 శాతం ఉత్తీర్ణత సాధించారని హెచ్ఎం సత్యనారాయణ తెలిపారు. పరీక్షలకు సీనియర్ ఇంటర్ విద్యార్థులు 13 మంది, ఫస్ట్ ఇయర్ విద్యార్థులు 16 మంది హాజరయ్యారన్నారు. సీనియర్ బైపీసీలో సుభాషిణి 814 మార్కులు, జూనియర్ బైపీసీలో జ్యోతుల మహేశ్వరి 417 మార్కులు పొందారన్నారు. ఉత్తీర్ణత సాధించిన వారంతా ప్రథమ శ్రేణిలోనే పాసయ్యారని వివరించారు.

బిల్లులు లేని వస్తువుల స్వాధీనం

రాజమహేంద్రవరం సిటీ: జనరల్ ఎలక్షన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్‌లో భాగంగా జీఆర్పీ డిప్యూటీ సూపరింటెండెంట్ ఎల్.మోహనరావు సూచనల మేరకు తనిఖీలు నిర్వహించామని జీఆర్పీ ఎస్సై లోవరాజు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్ పార్సిల్ ఆఫీసులో ఎటువంటి ధ్రువీకరణ పత్రాలు లేని రూ.21 వేల విలువైన 84 నాన్ స్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎలక్షన్ ఫ్లైయింగ్ స్క్వాడ్ ద్వారా జిల్లా ఎలక్షన్ గ్రీవెన్స్ కమిటీకి అప్పగించినట్లు తెలిపారు.


ప్రచారంలో పాల్గొన్న ఎంపీ భరత్ రామ్

జగనన్న అంటే ప్రజలకు భరోసా

- ఎంపీ, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌రామ్
- 39వ డివిజన్‌లో పర్యటన

రాజమహేంద్రవరం సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అంటే ప్రజలకు ఒక నమ్మకం, భరోసా అని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్ అన్నారు. స్థానిక 39వ డివిజన్‌లో ఇన్‌చార్జి లంక ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆయన పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. భరత్ రామ్ మాట్లాడుతూ సీఎం జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలు నిరుపేద కుటుంబాలలో వెలుగులు నింపాయన్నారు. నిరుపేదల సొంతింటి కల సాకారానికి రాష్ట్ర వ్యాప్తంగా 31 లక్షల మందికి ఇళ్ల పట్టాలిచ్చారన్నారు. నగరంలో మొత్తం 40 వేల కుటుంబాలకు పైగా ఇళ్ల పట్టాలిస్తే, చూసి సహించలేక టీడీపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇటువంటి ఆరోపణలు చేసే వారికి ప్రజలే తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు మళ్లీ ప్రజలను మోసగించేందుకు కొత్త స్కీమ్ లతో ఓట్లు అడిగేందుకు వస్తున్నారని ధ్వజమెత్తారు. అసలు ప్రజలను ఓటు అడిగే హక్కు టీడీపీకి లేదన్నారు. సిటీ ఎమ్మెల్యేగా ఆదిరెడ్డి భవాని గెలిచాక ప్రజలకు ముఖమే చూపించడమే మానేశారన్నారు. ఆదిరెడ్డి కుటుంబాన్ని నమ్మే పరిస్థితులలో జనం లేరన్నారు. ఎంపీగా నగరాన్ని అత్యద్భుతంగా తీర్చిదిద్దానని, ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత మరింత అభివృద్ధి చేసి విశ్వనగరంగా ప్రపంచ పటంలో ఒక ప్రత్యేక స్థానం వచ్చేలా కృషి చేస్తానన్నారు.

నైపుణ్య శిక్షణతో మహిళల అభ్యున్నతి


మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న శాస్త్రవేత్త సుమన్ కల్యాణి

రాజమహేంద్రవరం సిటీ: మహిళలు ఆర్థిక అభ్యున్నతి సాధించడానికి నైపుణ్య శిక్షణ ఎంతో దోహదపడుతుందని సీటీఆర్ఐ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సుమన్ కల్యాణి అన్నారు. స్థానిక లాలాచెరువులోని స్వర్ణాంధ్ర ఉచిత కుట్టు, మగ్గం వర్క్ శిక్షణా కేంద్రంలో 71వ బ్యాచ్ ముగింపు ఉత్సవం శుక్రవారం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కల్యాణి మాట్లాడుతూ మహిళలు కష్టపడి సంపాదించిన మొత్తాలను పొదుపు చేయడంతోనే ఆయా కుటుంబాలు ఆర్థికంగా నిలబడుతున్నాయన్నారు. స్వర్ణాంధ్ర నిర్వాహకుడు రాంబాబు మాట్లాడుతూ 26 ఏళ్లగా స్వర్ణాంధ్ర సేవా సంస్థ తరఫున కంప్యూటర్, కుట్టు, మగ్గంవర్క్‌లో సుమారు 18,090 మందికి శిక్షణ అందించామన్నారు. శిక్షణ సమయంలో మెటీరియల్, మధ్యాహ్న భోజనంతో పాటు శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు, జ్ఞాపికలు బహూకరిస్తామన్నారు. ఈనెల 15 నుంచి కొత్త బ్యాచ్ ప్రారంభమవుతుందని, ఆసక్తి కలవారు స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో, లేదా 98498 47489 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సంక్షేమ ప్రదాత ముఖ్యమంత్రి జగన్


ధవళేశ్వరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న షర్మిలారెడ్డి, ఉమాశంకర్

ధవళేశ్వరం: సంక్షేమ ప్రదాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి అన్నారు. మంత్రి వేణుగోపాలకృష్ణ తనయుడు ఉమాశంకర్‌తో కలిసి శుక్రవారం ధవళేశ్వరంలోని సుబ్బయ్యమ్మపేట, సంజయ్‌నగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అందించిన జగన్.. దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా నిలిచారన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి ఆయన ముఖ్యమంత్రి కావాలన్నారు. ఎమ్మెల్యేగా మంత్రి వేణుగోపాలకృష్ణ, ఎంపీగా గూడూరి శ్రీనివాస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తలారి వరప్రసాద్, సాధనాల చంద్రశేఖర్ (శివ), ఎన్వీ శేఖర్, దేవులపల్లి సరితారాణి, కేతా సాయి, చాటాకల చంటి, గునిపే అశోక్, డాక్టర్ చొల్లంగి సత్యగిరి, పసుపులేటి దేవి, గూటం రాజు, ఎల్వీ ప్రసాద్ పాల్గొన్నారు.